సిపిఎం సీనియర్ నాయకులు వేగినాటి మృతి

- నివాళులర్పించిన తమ్మినేని, పోతినేని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఖమ్మం జిల్లా రూరల్ మండలం తెల్దారుపల్లి గ్రామానికి చెందిన సిపిఎం సీనియర్ నాయకులు, ప్రజా నాట్య మండలి జిల్లా కమిటీ సభ్యులు వేగినాటి వెంకటేశ్వర్లు (73) ఆదివారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. వెంకటేశ్వర్లు మరణ వార్త తెలిసిన వెంటనే పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం వెంకటేశ్వర్లు మృతదేహాన్ని సందర్శించి ఎర్ర జెండా కప్పి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ.. వెంకటేశ్వర్లు జీవితాంతం ఎర్రజెండా అభ్యున్నతికి చేసిన కృషిని కొనియాడారు. వెంకటేశ్వర్లతో తనకున్న బంధాన్ని, జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. మృతునికి భార్య సత్యవతి, ఇద్దరు కుమారులున్నారు. వెంకటేశ్వర్లు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించిన వారిలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, జిల్లా నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు, కల్యాణం వెంకటేశ్వరరావు, భూక్య వీరభద్రం, వై విక్రమ్, మాదినేని రమేష్ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే మద్దతుగా బిఆర్ఎస్ భారీ ర్యాలీ

ర్యాలీ నిర్వహిస్తున్న బిఆర్ఎస్ శ్రేణులు

- ఐటి దాడులతో ఎమ్మెల్యే రాజకీయ ఎదుగుదలను ఆపలేరు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

యాదాద్రి భువనగిరి జిల్లాలోని భువనగిరి నియోజకవర్గంలో ఎన్నికల హడావుడి తలపించే విధంగా బిఆర్ఎస్ శ్రేణులు బైక్ ర్యాలీ నిర్వహించారు. భువనగిరి శాసనసభ్యులు పైళ్ల శేఖర్‌రెడ్డి ఇంటిపై నిర్వహించిన ఐటీ దాడుల్లో ఎలాంటి అక్రమ ఆస్తులు బయటపడలేదని ఎమ్మెల్యే కడిగిన ముత్యమని తెలుపుతూ యాదాద్రి భువనగిరి పట్టణంలోని స్థానిక పాలశీతలీకరణ కేంద్రం నుంచి హైదరాబాద్ చౌరస్తా వరకు బిఆర్ఎస్ శ్రేణులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఓపెన్‌టాప్ జీపుపై ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ జడల అమరేందర్‌గౌడ్, రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షులు కొలుపుల అమరేందర్ ఉండగా నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున బైకులు నడిపిస్తూ బిజెపికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నాయకులు, కార్యకర్తలు గులాబీ కండువాలు వేసుకొని ఎమ్మెల్యేపై గులాబీ పూలవర్షం కురిపించారు. ఎమ్మెల్యేకు రాజ కిరీటం పెట్టి చేతికి తల్వార్ అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నేరుగా, రాజకీయంగా ఎదుర్కోలేక ఇలాంటి చర్యలు పూనుకుంటున్నారని ఆరోపించారు. ఇంట్లో సోదాలు జరిపిన ఎలాంటి అవినీతి అక్రమాలకు సంబంధించిన పత్రాలు లభించలేదని తెలిపారు. తాను చాలా ఏళ్ళుగా వ్యాపారంలో ఉన్నానని, ప్రతిది అకౌంటబుల్‌గా తన నిర్వహణ ఉంటుందని తెలిపారు. ఇది తన రాజకీయ ఎదుగుదలను ఓర్వలేక ఇతర పార్టీ నాయకులు తనపై ఇలాంటి సోదాలు నిర్వహించే విధంగా ప్రోత్సహించారని ఆరోపించారు. రాజకీయాల్లో కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ ఎనబోయిన ఆంజనేయులు, వైస్‌చైర్మెన్ చింతల కిష్టయ్య, పార్టీ పట్టణ అధ్యక్షులు ఎవి కిరణ్‌కుమార్, నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పేదల గుడిసెలకు పట్టాలిచ్చే వరకు పోరాటం

- జెండా ఊపి బస్సు యాత్రను ప్రారంభించిన నాగయ్య

బస్సు యాత్రకు జెండా ఊపుతున్న నాగయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకున్న నిరుపేదలపై ప్రభుత్వ నిర్బంధం వెంటనే ఆపాలని.. వారిపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని తెలంగాణ ప్రజాసంఘాల పోరాట వేదిక డిమాండ్ చేస్తోంది. అలాగే గుడిసెలు వేసుకున్న ప్రతి ఒక్కరికి 125 గజాల స్థలాన్ని పట్టా చేసి ఇంటి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.పది లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.5.50 లక్షలు ఆర్థిక సాయం చేయాలని కోరింది. ఈ డిమాండ్లతో ఆదివారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి నాగయ్య బస్సు యాత్రను ప్రారంభించారు. ఈ బస్సు యాత్ర బృందానికి వేదిక కన్వీనర్ ఎస్ వీరయ్య నాయకత్వం వహించారు. ఈ నెల 27న రంగారెడ్డి జిల్లాలో యాత్ర ముగియనుంది.

ఎయిర్‌పోర్టులో బంగారం పట్టివేత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విదేశాల నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్న బంగారాన్ని కస్టమ్స్, ఎయిర్ ఇంటలిజెన్స్ అధికారులు శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఆదివారం పట్టుకున్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. ఎమిరేట్స్ విమానం ఇకె-524లో దుబాయ్ నుంచి మహిళా ప్రయాణికురాలు హైదరాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి ఆదివారం తెల్లవారుజామున 02:57 గంటలకు చేరుకుంది. అనుమానం వచ్చిన కస్టమ్స్ ఎయిర్ ఇంటెలిజెన్స్ యూనిట్ అధికారులు ఆమెను అడ్డుకుని తనిఖీ చేశారు. ఆమె లో దుస్తుల్లో బంగారం పేస్ట్, రెండు చిన్న గొలుసులతో కూడిన ప్యాకెట్‌ను దాచిపెట్టినట్టు గుర్తించారు. ఆమె వద్ద రూ.45,37,500 విలువ చేసే 726 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితురాలిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

మరో ప్రయాణికుని నుంచి 127 గ్రాముల బంగారం స్వాధీనం

శనివారం దుబాయ్ నుంచి ఒక వ్యక్తి 6ఈ-1484 విమానంలో శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్నాడు. అనుమానంతో అతన్ని కస్టమ్స్ ఎయిర్ ఇంటెలిజెన్స్ యూనిట్ అధికారులు అడ్డుకొని తనిఖీ చేశారు. అతని వద్ద గోధుమరంగు పౌడర్‌తో కూడిన ప్లాస్టిక్ బాక్స్‌తో పాటు పిల్లల పాల డ్రింక్ మిక్స్ కనిపించింది. దాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయడంతో పాటు అతన్ని ప్రశ్నించారు. బ్రౌన్ పౌడర్‌లో బంగారం పౌడర్ ఉన్నట్టు తేలింది. వెంటనే అధికారులు పౌడర్ నుంచి బంగారాన్ని వేరు వేశారు. మొత్తం 127 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. దాని విలువ రూ.7,77,621 ఉంటుందని అధికారులు అంచనా వేశారు. నిందితున్ని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

ఇళ్ల జాగాలు అడిగితే దాడులా?

- ప్రభుత్వ భూములపై ప్రజలదే హక్కు
- వందల ఎకరాలు ఆక్రమిస్తున్న వారిపై చర్యలేవి?
- దాడులు, అరెస్టులకు మేం భయపడం
- సాహెబ్ నగర్‌లో మహిళలపై దాడి చేసిన పోలీసులను వెంటనే సస్పెండ్ చేయాలి
- అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్‌వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గూడులేని పేదలు ఇళ్ల జాగాలు అడిగితే వారిపై పోలీసులు జులుం ప్రదర్శించి మహిళలని కూడా చూడకుండా పోలీసు బలగాలతో దాడులు చేయించారని, ప్రభుత్వ భూములపై పేదోడికే హక్కు ఉందని, ఆ జాగాలు పేదలకు దక్కే వరకూ అరెస్టులు చేసి జైల్లో వేసినా భూ పోరాటాన్ని ఆపమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్‌వెస్లీ ప్రభుత్వానికి హెచ్చరించారు. రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ మండలం సాహెబ్‌నగర్ కాలనీలో ఇళ్ల జాగాలేని నిరుపేదలు ప్రభుత్వ భూమిలో గూడిసెలు వేసుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారన్న నేపంతో పోలీసులు వారిపై శనివారం రాత్రి దాడి చేశారు. స్థానికులు, సిపిఎం నాయకులను అరెస్టు చేసి జైలుకు పంపించారు. దీన్ని ఖండిస్తూ ఆదివారం వనస్థలిపురం పోలీసు స్టేషన్ ఎదుట సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. ఇళ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న నిరుపేదలు.. ప్రభుత్వ జాగాల్లో గుడిసెలు వేసేందుకు ప్రయత్నం చేస్తే మానవతా దృక్పథంతో వారిని ఆదుకోవాల్సిందిపోయి వారిపై పోలీసు బలగాలను ఊసిగొల్పడం ఏమిటని ప్రశ్నించారు. అమాయకమైన ప్రజల ఇళ్లలో చొరబడి దాడులు చేయడం సిగ్గు చేటన్నారు. మహిళలు అని కూడా చూడకుండా ఇష్టానుసారంగా దాడులు చేయడం బాధాకరమని, ఈడ్చుకెళ్లి జైల్లో వేయడం పోలీసుల దమణకాండకు నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలపై దాడులు చేయిస్తున్న ప్రభుత్వం వందల ఎకరాల ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్న భూ బకాసురులపై ఎలాంటి చర్యలు తీసుకుందో చెప్పాలని డిమాండ్ చేశారు. వారిపై కూడా ఇలాగే దాడులు చేసే దమ్ము ప్రభుత్వానికి ఉందా అని నిలదీశారు. రియల్ వ్యాపారుల నుంచి ప్రభుత్వ భూములను కాపాడాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణమే సాహెబ్‌నగర్ కాలనీ వాసులపై పెట్టిన కేసులు ఎత్తివేసి వారిని బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అక్రమ కేసులు పెట్టిన సిఐని సస్పెండ్ చేయాలని, మహిళలపై దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు ఉన్నతాధికారులను కోరారు. పోలీసుల కేసులు, రెవెన్యూ అధికారుల బెదిరింపులకు ఎర్ర జెండా భయపడబోదన్నారు. పోరాటాలు తమకు కొత్తేమీ కాదని, తమపై ఎన్ని నిర్బంధాలు విధించినా భూ పోరాటాలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. పేదలకు ఇండ్ల జాగలు దక్కే వరకూ ఉద్యమాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. ఇండ్లు లేని ప్రతి పేదోడికి ఇంటి జాగాలు ఇవ్వాలని రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 18 నుంచి 27 వరకు తెలంగాణ ప్రజాసంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో బస్సుయాత్ర కొనసాగుతుందన్నారు. ఈ యాత్ర రంగారెడ్డి జిల్లాలోనూ కొనసాగుతుందని తెలిపారు.

బస్సుజాతాను అడ్డుకోవడం దుర్మార్గం

అరెస్టు చేసినవారిని వెంటనే విడుదల చేయాలి : తమ్మినేని

ప్రజాసంఘాల పోరాటవేదిక ఆధ్వర్యంలో పేదలందరికీ ఇళ్లు, ఇళ్లస్థలాలు ఇవ్వాలనే డిమాండ్‌తో మహబూబాబాద్‌లో ప్రారంభమైన బస్సుయాత్రను పోలీసులు అడ్డుకుని ఆపేందుకు ప్రయత్నించటాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఆదివారం ఒక ప్రకటనలో ఖండించారు. నాయకులు పాదయాత్రగా వెళ్లి భూపోరాట కేంద్రాన్ని సందర్శిస్తున్న సమయంలో బస్సు డ్రైవర్‌ను కొట్టి, బస్సును కూడా పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లడం, గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీరాంనాయక్‌ను అరెస్టు చేయడం అత్యంత దారుణమని తెలిపారు. వీరిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వెంటనే బస్సును జాతా బృందానికి అప్పగించాలని కోరారు. ప్రజాస్వామ్యయుతంగా సాగుతున్న యాత్రను అడ్డుకోవాలని చూస్తే ప్రజాగ్రహం చవిచూడక తప్పదని ఆయన హెచ్చరించారు.

హైటెక్ కాపీయింగ్‌పై చర్యలు : డిఐఇఒ వడ్డెన్న

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎస్ఆర్‌నగర్ అమోఘ జూనియర్ కాలేజీలో(సీనెం.60334) ఈ నెల 15న జరిగిన ఇంటర్ అడ్వాన్సుడ్ సప్లిమెంటరీ పరీక్ష గణితశాస్త్రం 1బి హైటెక్ కాపీయింగ్ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై జిల్లా ఇంటర్మీడియట్ అధికారి (డిఐఇఒ) దాసరి వడ్డెన్న స్పందిస్తూ.. ఎస్ఆర్ నగర్ అమోఘ కాలేజీ హైటెక్ కాపీయింగ్‌పై అదే రోజున(గురువారం) సంబంధిత డిపార్టుమెంటల్ ఆఫీసర్ (డిఒ), చీఫ్ సూపరిటెండెంట్ (సిఎస్)పైన శాఖ పరమైన చర్యలు తీసుకుంటూ.. వారిని పరీక్షా విధులను నుంచి తొలగించామని, ఆస్థానంలో మరొకరిని నియమించి పరీక్షలు సజావుగా, పారదర్శకంగా నిర్వహించామని డిఐఇఒ వడ్డెన్న వివరించారు.

రాకేశ్‌మాస్టార్ మృతి బాధాకరం : పిఎన్ఎమ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాకేశ్ మాస్టార్ మృతి బాధాకరమని ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వేముల ఆనంద్, కట్ట నర్సింహ్మ పేర్కొన్నారు. ఆయన మృతికి సంతాపం, కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆదివారం ఈ మేరకు వారు ఒక ప్రకటన విడుదల చేశారు. మంచి కొరియోగ్రాఫర్, అభ్యుదయవాది, హేతువాదిని కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. రాకేశ్ మాస్టార్ 1500కిపైగా చిత్రాలకు కొరియోగ్రాఫర్‌గా పనిచేశారని, శేఖర్ మాస్టార్, జానీ మాస్టార్, ఇలా అనేక మంది డ్యాన్స్ మాస్టార్లకు గురువుగా వ్యవహరించారని గుర్తుచేశారు. తనకు అన్ని మతాలూ సమానమేనని, మనుషులందరూ ఒక్కటేనని చాటేలా తన ఒంటిపై హిందూ, క్రిస్టియన్, ముస్లిం, తదితర మతాల చెందిన ప్రతిమలను పచ్చబొట్లుగా పొడిపించుకున్నారని తెలిపారు. అందరితోనూ కలివిడిగా ఉండే రాకేశ్ మాస్టార్ అనారోగ్యంతో మృతిచెందడం బాధాకరమని పేర్కొన్నారు.

ఇచ్చిన హామీలు అమలు చేయాలి

- పూర్తి రుణ మాఫీ చేయాలి
- ధాన్యం డబ్బులు వెంటనే చెల్లించాలి
- ఎడమ కాలువ పెండింగ్ లైనింగ్ పనులు పూర్తి చేయాలి : జూలకంటి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వంద శాతం అమలు చేసినప్పుడే బిఆర్ఎస్ పార్టీని ప్రజలు ఆదరించి మళ్లీ అవకాశం ఇస్తారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. మిర్యాలగూడ పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కెసిఆర్ ప్రభుత్వం ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చిందని, వాటిని ఈ ఎన్నికల ముందే అమలు చేసి చిత్తశుద్ధి నిరూపించుకోవాలన్నారు. రూ.లక్ష రుణమాఫీ చేస్తామని చెప్పిన కేసీఆర్ ప్రభుత్వం ఇప్పటి వరకు రుణమాఫీ పూర్తి స్థాయిలో చేయలేదని విమర్శించారు. ఇంకా రూ.13,700 కోట్ల రుణమాఫీ బకాయిలు ఉన్నాయని, వాటిని వెంటనే చెల్లించి పూర్తిస్థాయి రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. అలా చేసినప్పుడే రైతులు ఈ సీజన్‌లో పంటలు సాగు చేసుకునేందుకు అవకాశం ఉంటుందని, మళ్లీ బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకునే సదుపాయం ఉంటుందన్నారు. యాసంగి సీజన్‌లో ధాన్యం అమ్ముకున్న రైతులకు ప్రభుత్వం డబ్బులు చెల్లించలేదని, దాంతో రైతుల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. వెంటనే ధాన్యం డబ్బులను చెల్లించాలని కోరారు. ఈ సీజన్‌లో నకిలీ విత్తనాలు, ఎరువులు మార్కెట్‌లో ఉండకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సకాలంలో ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలని కోరారు. 11 లక్షల ఎకరాలకు పోడు భూములకు పత్రాలు ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని, కానీ నేటికీ అమలు లేదని చెప్పారు. వెంటనే పోడు పత్రాలు వచ్చి ఆ రైతులకు అన్ని రకాల రాయితీలు కల్పించాలని కోరారు. ధరణిలో ఉన్న లోపాలను సరి చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల జీవితాలతో ఆడుకోకుండా వారిని అన్ని రకాలుగా ఆదుకోవాలని సూచించారు. ఎడమ కాలువ ఆధునీకరణ చేపట్టినప్పుడు ఆయా మేజర్ల పరిధిలో లైనింగ్ పనులు మధ్య మధ్యలో వదిలేశారని, దానివల్ల గండ్లు పడే ప్రమాదం ఉందని, వెంటనే పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. వానాకాలం సీజన్ ప్రారంభం కాకముందే లైనింగ్ పనులు పూర్తి చేయాలన్నారు. రాష్ట్ర ఏర్పడితే ఎత్తిపోతల పథకాలను ప్రభుత్వమే నిర్వహిస్తుందని కేసీఆర్ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పుడు ప్రాజెక్టు అందులో అంతర్భాగంగా ఎత్తిపోతలను పరిగణలోకి తీసుకొని రిపేర్లు చేయించి పూర్తి నిర్వహణ బాధ్యత ప్రభుత్వమే తీసుకోవాలన్నారు. సమావేశంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేశ్, జిల్లా కమిటీ సభ్యులు డాక్టర్ మల్లు గౌతమ్‌రెడ్డి, సీనియర్ నాయకులు నూకల జగదీష్‌చంద్ర, రెమిడాల పరుశరాములు, రాగిరెడ్డి మంగారెడ్డి, తిరుపతి, రామ్మూర్తి, వినోద్‌నాయక్ పాల్గొన్నారు.

బస్సు యాత్రను అడ్డుకునేందుకు ఖాకీల కుట్ర

- గంటసేపు పోలీసు స్టేషన్‌లో బస్సు - డ్రైవర్‌పై దాడి
- గిరిజన సంఘం నేత శ్రీరాంనాయక్ అరెస్టు, విడుదల
- అన్నివైపుల నుంచి ఒత్తిడి రావడంతో దిగొచ్చిన పోలీసులు
- బ్రేకులేస్తే బస్సు ఆగుద్దేమో.. యాత్ర కాదు : ఎస్ వీరయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహబూబాబాద్ పోలీసులు మరోసారి దౌర్జన్యాన్ని ప్రదర్శించారు. రియల్‌ఎస్టేట్ వ్యాపారుల కబ్జాల నుంచి ప్రభుత్వ భూమిని కాపాడేందుకు గుడిసెలు వేసి పోరాటం చేస్తున్న పేదలపై దమనకాండ సాగించిన పోలీసులు, ఇప్పుడు వారిని పరామర్శించేందుకు వెళ్లినవారిపైనా అదే దౌర్జన్యాన్ని ప్రదర్శించారు. తెలంగాణా ప్రజాసంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో ప్రజాసంఘాల నాయకత్వం పేదలను పరామర్శించేందుకు ఆదివారం ప్రత్యేక యాత్ర బస్సులో వెళ్తుండగా దానికి బ్రేకులేసేందుకు పోలీసులు విఫలయత్నం చేశారు. ఘటనా స్థలానికి యాత్ర బస్సును వెళ్లకుండా తొలుత పోలీసులు అడ్డుకున్నారు. అయినా వేదిక నాయకులు బస్సు దిగి నడిచి ఘటనా స్థలానికి వెళ్లారు. నాయకులు కొద్దిదూరం వెళ్లగానే రెచ్చిపోయిన పోలీసులు యాత్ర బస్సు డ్రైవర్ సురేష్‌పై చేయి చేసుకున్నారు. బలవంతంగా బస్సును పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లారు. అడ్డుకునేందుకు ప్రయత్నించిన గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీరాంనాయక్‌నూ అరెస్టు చేశారు. ఈ ఘటనను చిత్రీకరించేందుకు ప్రయత్నించిన కెమెరామెన్లపై దాడి చేశారు. సెల్ ఫోన్లు లాక్కున్నారు.

విషయం తెలుసుకున్న పేదలు ఒక్కసారిగా పోరాట కేంద్రం నుంచి రోడ్డు మీదకు వచ్చే ప్రయత్నం చేయడం, మరోవైపు అన్ని వైపుల నుంచి తీవ్రమైన ఒత్తిడి రావడంతో పోలీసులు వెనక్కు తగ్గి బస్సును వదిలేశారు. అక్కడి నుంచి సూర్యాపేట జిల్లాలోని కోదాడకు బస్సు ప్రయాణమైంది

ఆదివారం మహబూబాబాద్‌లో ప్రజాసంఘాల పోరాట వేదిక బస్సు యాత్రను జెండా ఊపి ప్రారంభించిన 20 నిమిషాలకే పై ఘటన జరిగింది. యాత్ర ప్రారంభానికి ముందు మార్కెట్ యార్డు వద్ద ఉన్న స్థలంలో భారీ బహిరంగ సభ జరిగింది. సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్ అందులో మాట్లాడారు. సభ జరుగుతుండగానే సభా ప్రాంగణం పక్కనే రియల్ ఎస్టేట్ వ్యాపారులు పోలీసులకు సకల మర్యాదలు చేశారు. ఈ విషయాన్నీ బహిరంగ సభలో వక్తలు ఎండగట్టారు. బహిరంగ సభ ముగిసి, బస్సు యాత్ర ప్రారంభమైన 20 నిమిషాల అనంతరం పోలీసులు విశ్వరూపం ప్రదర్శించారు. ఈ సందర్భంగా వేదిక కన్వీనర్ వీరయ్య మాట్లాడుతూ.. 'పేదల ఇళ్లస్థలాల కోసం చేపట్టిన తెలంగాణ ప్రజాసంఘాల పోరాట వేదిక బస్సు యాత్రను మహబూబాబాద్ పోలీసులు అడ్డుకున్నారు. దీనిని ఆపివేయాలని కుట్ర చేశారు.

బస్సును అడ్డుకున్న పోలీసు

'బ్రేకులు బస్సులకుంటాయి.. యాత్రకుండవ్.. ఒకవేళ యాత్రను ఆపేందుకు ప్రయత్నిస్తే ప్రజల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుంది. దీనికి పోలీసులదే పూర్తి బాధ్యత' అని అన్నారు. రియల్‌ఎస్టేట్ వ్యాపారుల ప్రోద్బలంతో పేదలపై ఇప్పటికే అనేక సార్లు మహబూబాబాద్ పోలీసులు దాడి చేశారని, వాస్తవానికి పేదల సంక్షేమమని రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్నదానికి వ్యతిరేకంగా వీరు పని చేస్తున్నట్టుందని వీరయ్య విమర్శించారు.

రాజ్యాంగ మౌలిక సూత్రాలకు ఆటంకం కలిగించొద్దు

- హైకోర్టు చీఫ్ జస్టిస్ ఉజ్వల్ బుయాన్
- రాజ్యాంగం న్యాయ వ్యవస్థపై సెమినార్
- ఐలూ మహాసభలు విజయవంతం

సెమినార్‌లో మాట్లాడుతున్న జస్టిస్ ఉజ్వల్ బుయాన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాజ్యాంగ మౌలిక సూత్రాలకు ఆటంకం కలిగించకుండా పరిపాలన కొనసాగించాలని తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్ ఉజ్వల్ బుయాన్ ఉద్ఘాటించారు. ఆలిండియా లాయర్స్ యూనియన్ తెలంగాణ రాష్ట్ర మహాసభలు ఆదివారం రెండవరోజు యాదాద్రి భువనగిరి జిల్లాకేంద్రంలో కొనసాగాయి. ఈ సందర్భంగా 'రాజ్యాంగం న్యాయవ్యవస్థ' అంశంపై నిర్వహించిన సెమినార్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. రాజ్యాంగం మౌలికసూత్రాలకు లోబడి అధికారపార్టీ పరిధి కట్టుబడి ఉండాలని విస్తృత ధర్మాసనం వెలువర్చిన తీర్పును కేశవానంద భారతి కేసులో అంశాలను ప్రత్యేకంగా గుర్తించామన్నారు. దేశంలో అత్యవసర పరిస్థితి సమయంలో ఆనాటి ప్రభుత్వం పౌరులహక్కులను కాలరాసినప్పుడు.. న్యాయ వ్యవస్థ వ్యవహరించిన తీరు అభినందనీయమన్నారు. రాజ్యాంగం ఇచ్చిన హక్కులను ప్రభుత్వాలు తమ వ్యక్తిగత ఎజెండాల కోసం కాలరాసినప్పుడు ఆ హక్కులు కాపాడే బాధ్యతని పౌరులు తీసుకోవాలని కోరారు. పౌరుల హక్కులను రక్షించే విషయంలో న్యాయవాదుల పాత్ర చాలా ప్రముఖమైన పాత్ర వహించాలని కోరారు. ఐలూ లాంటి సంస్థలు ఇలాంటి వాటిల్లో ముందుంటాయని తెలిపారు. తెలంగాణ బార్ కౌన్సిల్ చైర్మెన్ ఎ నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. ఐలూతో సత్సంబంధాలను కలిగి ఉన్నారని, తన కార్యనిర్వహణలో ఐలు తోడ్పాటు ఎల్లప్పుడూ ఉంటుందని వివరించారు. భవిష్యత్‌లో ఐలూ తీసుకునే కార్యక్రమాలకు సంపూర్ణ మద్దతు తెలిపారు. న్యాయవాద వృత్తిలో ఉన్న ప్రతి న్యాయవాది చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఐలూ ఆలిండియా కార్యదర్శి సురేంద్రనాథ్ పాల్గొనగా, మహాసభలకు అధ్యక్షవర్గంగా రాష్ట్ర అధ్యక్షులు విద్యాసాగర్, నాయకులు అనంతల శంకరయ్య, శైలజ వహించారు. కాగా, రెండు రోజులుగా నవ తెలంగాణ బుక్ హౌస్ ఏర్పాటుచేసిన పుస్తక ప్రదర్శనలో ప్రతినిధులు పుస్తకాలు కొనుగోలుచేశారు. మహాసభలకు 400 మంది ప్రతినిధులు హాజరై సభను విజయవంతం చేశారు. మహాసభకు విజయవంతానికి సహకరించిన ప్రతిఒక్కరికి ప్రతినిధులకు ఆహ్వాన సంఘం అధ్యక్షులు నాగారం అంజయ్య, ఐలూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మామిడి వెంకరెడ్డి, ఎండి స్మైల్ అభినందనలు తెలిపారు. మహాసభలో ఆహ్వానసంఘం గౌరవ అధ్యక్షులు కొత్త బుచ్చిరెడ్డి, కార్యదర్శి ఎండి ఇస్మాయిల్, ఐలు జిల్లా అధ్యక్షులు మామిడి వెంకటరెడ్డి, నాయకులు నర్సింగ్‌యాదవ్, కేశవరెడ్డి, కుక్కదూగ సోమయ్య, బాబురావు, చింతల రాజశేఖర్, రెడ్డి, బొలెపెల్లికుమార్ పాల్గొన్నారు.

పలు అంశాలపై తీర్మానం

మహాసభల సందర్భంగా పలు అంశాలపై తీర్మానాలు చేశారు. న్యాయవిజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేయాలని, మృతి చెందిన న్యాయవాదికి రూ.ఆరు లక్షలు చెల్లించాలని తీర్మానించారు. న్యాయవాదులకు ఇళ్ల స్థలాలు ఉచితంగా లేదా కనీస ధరకు ఇవ్వాలన్నారు. న్యాయవాదులకు జీవితబీమా, ఆరోగ్య కార్డులు జారీ చేయాలని కోరారు. కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో పూర్తిస్థాయిలో కోర్టు భవనాలు నిర్మించి మౌలికవసతులు కల్పించాలన్నారు. న్యాయశాఖ ఉద్యోగాలను వెంటనే ఖాళీలను భర్తీ చేయాలని తీర్మానించారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనార్టీ న్యాయవాదులకు గవర్నమెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్స్, బ్యాంకు, జీవితబీమా కంపెనీల స్టాండింగ్ కౌన్సిల్ నియామకాల్లో ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని కోర్టులు ఆ చట్టాలకు అనుగుణంగా పనిచేసేలా రెగ్యులర్ న్యాయాధికారులను నియమించాలన్నారు. ఈ తీర్మానాలను మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది.

IN THE COURT OF THE MACT CUM CHIEF JUDGE : CITY CIVIL COURT AT HYDERABAD
O.P.No. 2099 OF 2022

BETWEEN:
N. Lingamma and another. ...Petitioners.
AND
M/s. Sirisampada Farm Lands Private Limited and others. ...Respondents.

To,
1. M/s. Sirisampada Farm Lands Private Limited, Rept., by its authorized signatory Raj Kumar Maganti, Age : Major, Owner of car bearing No.TS-09-FK-3333, R/o: H.No.2-334, Plot No.13 Road No.3 Banjara Hills, Hyderabad, Telagnana State- 500 084. ...Respondent No.1.
4. Anil kumar S/o. S. Chandra Shaker, Age: Major, Owner cum driver of car bearing No. TS-08-HQ-7023, R/o : F-501, B-Block, Millennium, Elitesatyamvalleyraji, V. Gandhinagar, Bachipalle, Hyderabad. ...Respondent No.4.

Please take notice that the petitioners have filed the above O.P. for compensation for the death of Thokala Lingaiah S/o Edaiah, in a raod accident caused by your car bearing No.**TS-09-FK-3333** and car bearing No.**TS-08-HQ-7023 on 15.10.2022** at about 15:00 hrs. The said O.P is posted to 30.06.2023 at 10.30 AM for your appearance and counter, Kindly make it convenient to be present on the said date before the Hon'ble Court by 10.30 AM in person or through your counsel. Otherwise the matter will be decided in your absence.

HENCE THIS NOTCE
BY ORDER OF THE COURT
M. VIJAY REDDY
ADVOCATE
2-2-647/A/58, Saibabanagar, Shivam Road, Bagh Amberpet, Hyderabad Ph. 7673904549, 9330489999

వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ నగరంలోని మౌలాలి ఫ్లైఓవర్ పైనుంచి దూకి వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన స్థానికులు వెంటనే ఆమెను గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఆత్మహత్యకు పాల్పడిన వివాహితను సుజి (37)గా గుర్తించారు. మృతురాలి కుటుంబసభ్యుల కోసం ఆరా తీస్తున్నట్లు మల్కాజిగిరి సిఐ రవికుమార్ తెలిపారు. ఆమె మృతికి గల కారణాల గురించి తెలుసుకుంటున్నామని చెప్పారు.

దరఖాస్తు గడువు పెంచండి..

- 'బిసిలకు ఆర్థిక సాయం' దరఖాస్తుపై తమ్మినేని మంత్రి గంగులకు లేఖ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

వృత్తి కులాలకు ఆర్థి సహాయం పథకానికి సంబంధించిన దరఖాస్తుల గడువును పెంచాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆయన బిసి సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్‌కు ఆదివారం లేఖ రాశారు. బిసి కులాలవారికి వృత్తుల ఆధునీకరణ, పనిముట్లు, ముడిసరుకుల కొనుగోలు కోసం రూ.లక్ష ఆర్థిక సహాయం అందించాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం అభినందనీయమని తెలిపారు. లక్షలాదిమంది ఈ పథకానికి అర్హులుగా ఉన్నారని పేర్కొన్నారు. దరఖాస్తు సమయంలో కులం, ఆదాయం, నివాస ధ్రువపత్రం, ఆధార్, రేషన్‌కార్డులు జతపరచాల్సి ఉన్నందున ఆయా పత్రాల కోసం పేదలు మండల కేంద్రాల చుట్టూ రోజుల తరబడి తిరుగుతున్నారని తెలిపారు. మీ సేవా కేంద్రాల్లో జనం బార్లు తీరుతున్నారని పేర్కొన్నారు. సర్టిఫికెట్లు జారీ చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతోందని తెలిపారు. వెబ్‌సైట్ సమయానికి ఓపెన్ కావడం లేదని తెలిపారు. సర్వర్‌డౌన్ అవుతుండడం వంటి సాంకేతిక సమస్యలతో పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. అర్హులైనవారికి కొత్త రేషన్ కార్డులు ఇవ్వకపోవడం కూడా సమస్యగా మారిందని పేర్కొన్నారు. వృత్తిదారుల్లో అనేకమంది నిరక్షరాస్యులు, అత్యంత వెనకబడినవారు కావటం వల్ల దరఖాస్తు చేసుకోవడానికి ఎక్కువ సమయం పడుతోందని తెలిపారు. దీంతో తాము ఆర్థిక సాయం పొందలేమనే ఆందోళనలో వృత్తిదారులున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆన్‌లైన్ దరఖాస్తు గడువును జూన్ ఆఖరు వరకు పొడిగించాలని తమ్మినేని కోరారు.

ఘనంగా మంచినీళ్ల పండుగ

- దేశానికే ఆదర్శం 'భగీరథ': మంత్రులు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ వ్యాప్తంగా మిషన్ భగీరథ మంచినీళ్ల పండుగ ఘనంగా జరిగింది. హైద్రాబాద్ రవీంద్రభారతిలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, హోంమంత్రి మహమూద్ అలీ, పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి, రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, మిషన్ భగీరథ కార్యదర్శి, సిఎంఒ కార్యదర్శి స్మితా సభర్వాల్, జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ ఎం దానకిషోర్, పురపాలక శాఖ కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి, సీనియర్ ఐఎఎస్ చంద్రశేఖర్‌రెడ్డి, తెలంగాణ డిజిటల్ మీడియా డైరెక్టర్ కొనతం దిలీప్, వాటర్ రిసోర్సెస్ కార్పొరేషన్ చైర్మన్ వి ప్రకాష్‌తో పాటు మిషన్ భగీరథ ఇంజినీర్ ఇన్ చీఫ్ ఎం కృపాకర్‌రెడ్డితో పాటు జలమండలి ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రుల ప్రసంగం వారి మాటల్లోనే...

దేశానికే ఆదర్శం భగీరథ
మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రెడ్డి

సిఎం కెసిఆర్ ముందస్తు విజన్‌తోనే మిషన్ భగీరథ తెచ్చారు. 2048 సంవత్సరం వరకు తాగునీటి సమస్య రాదు. భగీరథ నీళ్లు తాగితే కీళ్లనొప్పులు తగ్గుతాయి. రాష్ట్ర ప్రభుత్వం సొంతంగా నిధులు సమకూర్చుని రాష్ట్రంలోని ప్రతి ఇంటికి భగీరథ నీళ్లు వెళ్లేలా ప్రణాళిక రూపొందించి అమలు చేసింది. దాదాపు 15 రాష్ట్రాలు ఈ పథకానికి చూడటానికి వచ్చాయి. ప్రధాని సైతం అభినందించారు. నిధులు మాత్రం ఇవ్వడం లేదు. ఎన్నిసార్లు అడిగినా పట్టించుకోవడం లేదు. ప్రశంసిస్తున్నారు కానీ, పైసలు ఇస్తలేరు.

ఖాళీ బిందెలు కనుమరుగు
మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

ఒకప్పుడు ఎండాకాలం వచ్చిందంటే ఖాళీ బిందెలతో ఆడబిడ్డలు రోడ్లమీద ధర్నాకు కూర్చునేవారు. కానీ మిషన్ భగీరథ వచ్చినంక ఇప్పుడు ఆడబిడ్డలు నీళ్ల కోసం రోడ్డు మీదకు రావడం లేదు. ఇంటి ముందే తాగు నీళ్లు పట్టుకుని సంతోషంగా ఉంటున్నారు. ఖాళీ బిందెలే కనిపిస్తలేవు. ఎండా కాలంలోనూ నీటికొరత రాలేదు.

కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి

ముఖ్యమంత్రి కెసిఆర్ వల్లే మిషన్ భగీరథ విజయవంతమైంది. ఇప్పటిదాకా ఏ ముఖ్యమంత్రీ ఎంత భారీ స్థాయిలో ప్రాజెక్టులను చేపట్టలేదు. పేదల కోసం కెసిఆర్ కష్టపడుతుండు.

హోంమంత్రి మహమూద్ అలీ

తెలంగాణ ఉద్యమ సమయంలోనే ప్రజలకు మంచినీళ్లు ఇవ్వాలన్న దృఢ చిత్తంతో కెసిఆర్ ఉండేవారు. తాగునీటి కోసం ప్రజలు పడుతున్న బాధలను కళ్లారా చూసిన కెసిఆర్, తెలంగాణ రాష్ట్రం ఏర్పడినంక ఈ కష్టాలు అన్నింటిని తొలగిస్తామని చెప్పేవారు. మిషన్ భగీరథ తెచ్చారు. ఇప్పుడా కళ నెరవేరింది.

ప్రధానిని పిలిచాం : వేముల ప్రశాంత్‌రెడ్డి

భగీరథ ప్రారంభోత్సవానికి దేశ ప్రధానిని సిఎం కెసిఆర్ ఆహ్వానించారు. ఢిల్లీకివెళ్లి అనేకసార్లు భగీరథకు సాయం చేయమని అడిగారు. సాగు, తాగునీటి ప్రాజెక్టులకు అప్పులు తెచ్చుకోవడానికి అడ్డంకులు సృష్టించారు కేంద్ర ప్రభుత్వం భగీరథను ప్రశంసిస్తుంటే, రాష్ట్ర బిజెపి మాత్రం విమర్శలు చేస్తోంది. ఇది సరికాదు. అవాకులు, చేవాకులు బంద్‌చేసి, సాయం చేయడం ద్వారా రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లేందుకు సహకరించాలి.

పేదలపై నమోదు చేసిన అక్రమ కేసులు ఎత్తివేయాలి

- మహిళలను వెంటనే విడుదల చేయాలి : తమ్మినేని

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ మండలం సాయబ్‌నగర్‌లో అరెస్టు చేసిన పేదలు, మహిళలను వెంటనే విడుదల చేయాలని, వారిపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూమిలో ఇళ్ల జాగాల కోసం పోరాడుతున్న పేదలపై పోలీసులు విచక్షణారహితంగా లాఠీఛార్జి చేయడంతో పాటు వారిని అరెస్టు చేసి అర్ధరాత్రి జైలుకు పంపారని పేర్కొన్నారు. సాయబ్‌నగర్ సర్వే నెం.71లో ఉన్న 26 ఎకరాల ప్రభుత్వ భూమిలో తమకు ఇళ్ల స్థలాలు ఇప్పించాలని కోరుతూ తెలంగాణ ప్రజాసంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో సుమారు రెండు వేల మంది పేదలు ఉద్యమిస్తున్నారని తెలిపారు. జానెడు స్థలం కోసం పోరాడుతున్న పేదలపై స్థానిక సిఐ ఆధ్వర్యంలో పోలీసులు లాఠీఛార్జి చేసిప్రజాసంఘాల నేతలు, ఆందోళనకారులను అరెస్టు చేశారని తెలిపారు. వీరిలో సిఐటియు జిల్లా కార్యదర్శి చంద్రమోహన్, సిపిఎం స్థానిక నాయకులు గణేష్ గౌడ్, తొమ్మిది మంది మహిళలతో కలిపి మొత్తం 19 మంది ఉన్నారని పేర్కొన్నారు. ఆ ప్రాంతంలోని దళితవాడ మీద పోలీసులు దాడి చేసి, స్థానికులతో పాటు మహిళలను తీవ్రంగా గాయపర్చారని తెలిపారు.. రాజు అనే వ్యక్తి చేయి విరిగి ఆస్పత్రి పాలయ్యాడని పేర్కొన్నారు. ప్రభుత్వ భూములు రియల్ ఎస్టేటు వ్యాపారులు ఆక్రమిస్తుంటే.. పట్టించుకోని సర్కారు ఇళ్ల జాగాలు అడుగుతున్న పేదలపై కేసులు పెట్టటమేంటని ప్రశ్నించారు. పేదలపై తప్పుడు కేసులు బనాయించి జైలుపాటు చేయటం అప్రజాస్వామిక చర్య అని విమర్శించారు.

గచ్చిబౌలిలో దిఎలైట్ హోటల్ ప్రారంభం

హైదరాబాద్ : గచ్చిబౌలి రోడ్‌లోని ఓల్డ్ హాఫీజ్‌పేట్‌లో దిఎలైట్ హోటల్‌ను ఏర్పాటు చేసింది. ఆదివారం దీన్ని హీరోయిన్ నిధి అగర్వాల్, మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు, ప్రముఖ దర్శకులు సంపత్ నంది, విరూపాక్ష దర్శకులు కార్తిక్ దండు లాంఛనంగా ప్రారంభించారు. దిఎలైట్ హోటల్ ప్రారంభోత్సవానికి రావడం చాలా సంతోషంగా ఉందని నిధి అగర్వాల్ పేర్కొన్నారు. వారు ఇంకా ఎన్నో హోటల్స్ ప్రారంభించాలని కోరుకుంటున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో హోటల్ అధినేతలు బి శ్రీనివాస్ రెడ్డి, రామకృష్ణా రెడ్డి, టి జగదీశ్వర్ రెడ్డి, వి విష్ణు వర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాట్యంలో డాక్టర్ సౌమ్య రికార్డ్

ప్రజాశక్తి - కల్చరల్

ఎనిమిది నిమిషాలలో మంచు గడ్డలపై ఎనిమిది వస్తువులను ధరించి ఎనిమిది హారతులతో అష్ట లక్ష్మి అంశంగా కూచిపూడి నాట్య శైలిలో నర్తించిన డాక్టర్ బొమ్మకంటి సౌమ్య ఎనిమిది రికార్డ్స్ హోల్డర్ గా ప్రసంశలందుకున్నారు. తెలుగు విశ్వవిద్యాలయంలోని ఎన్. టిఆర్ కళామందిరంలో నూతన సంస్థ స్పందన నృత్య కేళి, స్పందన చారిటబుల్ ట్రస్ట్ ప్రారంభోత్సవ సందర్భంగా గురువు నేమాని రవి కుమార్ నృత్య దర్శనంలో డాక్టర్ సౌమ్య నర్తనం అత్యంత ప్రతిభా వంతం గా సాగింది. ముఖ్య అతిధిగా ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కే.వీ రమణ మాట్లాడుతూ.. స్థైర్యం, ఏకాగ్రత ధైర్యంతో సౌమ్య నర్తించి రికార్డ్స్ నమోదు చేసుకోన్నారని అభినందించారు

సుపారీ గ్యాంగే మాజీ ఎంపిడిఒను హత్య చేసింది

మిస్టరీ ఛేదించిప పోలీసులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం పోచన్నపేటకు చెందిన విశ్రాంత ఎంపిడిఒ నల్ల రామకృష్ణయ్య (70) హత్య కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. గురువారం అపహరణకు గురైన ఆయన మృతదేహాన్ని శనివారం జనగామ మండలంలోని చంపక్‌హిల్స్‌లోని అటవీ ప్రాంతంలో గుర్తించిన విషయం తెలిసిందే. ఆయన కుమారుడు అశోక్, కుటుంబసభ్యులు జనగామలో విలేకరులతో మాట్లాడుతూ.. జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి ప్రోద్బలంతోనే తన తండ్రి అపహరణకు గురయ్యారని ఆరోపించారు.

రాజకీయ జోక్యం ఉందని ఆరోపణలు రావడంతో పోలీసులు సీరియస్‌గా తీసుకుని మిస్టరీని ఛేదించారు. ఐదుగురు సభ్యుల సుపారీ గ్యాంగ్ రామకృష్ణయ్యను హత్య చేసినట్టు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఈ గ్యాంగ్‌లో ముగ్గురు నిందితులను అరెస్టు చేసిన పోలీసులు ఒక కారు, 3 సెల్‌ఫోన్లు, రూ.15వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారు.

కేసు వివరాలను వరంగల్ పోలీస్ కమిషనర్ రంగనాథ్ మీడియాకు వెల్లడించారు. గురబోయిన అంజయ్య భూములకు సంబంధించి కొద్ది రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. సర్వే నెంబరు 174 భూములకు సంబంధించి రామకృష్ణయ్య అధికారులకు ఫిర్యాదు చేశారు. తనను ఇబ్బందులు పెడుతున్న రామకృష్ణయ్యను హత్య చేయాలని అంజయ్య నిర్ణయించుకున్నాడు. అంజయ్యకు తిరుపతి గతంలో పరిచయం ఉండటంతో, హత్య గురించి వివరించి రూ.8లక్షలు ఇస్తానని ఒప్పందం చేసుకున్నాడు. తిరుపతి మరో ముగ్గురు నిందితులు తన దగ్గరి బంధువులైన డోలకొండ శ్రీకాంత్, శివరాత్రి బాషా అలియాస్ భాస్కర్, దండుగుల రాజు సహకారం తీసుకున్నాడు.

నలుగురు నిందితులూ కలిసి ఈనెల 15న సాయంత్రం 5.30 గంటలకు బచ్చన్నపేట నుంచి పోచన్నపేట వెళ్తున్న రామకృష్ణయ్యను బలవంతంగా కారులో కిడ్నాప్ చేశారు. అదే రోజు రాత్రి చిన్నరామన్చర్ల గ్రామ శివారులోకి తీసుకెళ్లి రామకష్ణయ్య మెడకు టవల్ బిగించి ఊపిరాడకుండా చేసి హతమార్చారు. హత్య అనంతరం మతదేహాన్ని కారు డిక్కీలో పెట్టి ఓబూల్ కేశవాపూర్, పెద్దపహాడ్ మీదుగా చంపక్ హిల్స్ ప్రాంతానికి తీసుకొచ్చి క్వారీ నీటి గుంతలో పడేశారు. అక్కడి నుంచి బచ్చన్నపేట చేరుకుని రామకృష్ణయ్యను హత్య చేసినట్టు ప్రధాన నిందితుడు అంజయ్యకు సమాచారం అందించి, కారును అతని ఇంటి ముందు వదిలేసి వెళ్లి పోయారు.

పోలీసులు అంజయ్యను అదుపులోకి తీసుకుని విచారించగా అసలు విషయం వెలుగు చూసింది. గిరబోయిన అంజయ్య, డోలకొండ శ్రీకాంత్, శివరాత్రి బాషా అలియాస్ భాస్కర్ అరెస్టు చేశామని, దండుగుల తిరుపతి, రాజు పరారీలో ఉన్నారని సిపి రంగనాథ్ తెలిపారు. ప్రధాన నిందితుడు అంజయ్య గత అక్టోబరులో రూ.2.50 లక్షలు సుపారీ ఇచ్చి సుభద్ర అనే మహిళను హత్య చేయించినట్టు విచారణలో తేలిందన్నారు.

జెఇఇ అడ్వాన్స్‌డ్‌లో రెసొనెన్స్ విద్యార్థులకు ర్యాంకులు

ప్రజాశక్తి - హైదరాబాద్

నగరంలోని రెసొనెన్స్ జూనియర్ కాలేజీలకు చెందిన విద్యార్థులకు జెఇఇ అడ్వాన్స్‌డ్ 2023 పరీక్షల్లో మెరుగైన ర్యాంకులు వచ్చాయని ఆ సంస్థ వెల్లడించింది. "ఈ జాతీయ ర్యాంకుల పట్ల మేము చాలా సంతోషంగా ఉన్నాము. హైదరాబాద్ కేంద్రం నుండి ర్యాంకులు పొందాము. దేశవ్యాప్తంగా అత్యుత్తమ ర్యాంకులను ఉత్పత్తి చేసిన చరిత్ర తమకు ఉంది. దాదాపు 190 మంది విద్యార్థులు రెసొనెన్స్ తెలుగు విద్యార్థులు ఐఐటి అర్హతకు సాధించే అవకాశాలున్నాయి." అని రెసొనెన్స్ హైదరాబాద్ సెంటర్ల డైరెక్టర్ పూర్ణచంద్రరావు తెలిపారు. ఓపెన్ కేటగిరీలో టాప్ వందలోపు 15 ర్యాంకులు సాధించారని తెలిపారు. రెసొనెన్స్ ర్యాంక్ బూస్టర్ కోర్సు విద్యార్థి అయిన హైదరాబాద్‌కు చెందిన బిక్కిన అభినవ్ చౌదరి ఓపెన్ కేటగిరీలో ఆలిండియా 7వ ర్యాంకు సాధించాడన్నారు. సిద్ధార్థ్ రెడ్డి పిడబ్ల్యుడి కేటగిరీలో ఆలిండియా 17వ ర్యాంకు పొందారన్నారు.

కుసుమ ధర్మన్నను ఒక తరగతికి పరిమితం చేయకండి

- ఆచార్య కొలకలూరి ఇనాక్

ప్రజాశక్తి - కల్చరల్

సమాజంలో ఉన్న వివక్షత, దురాచారలకు వ్యతిరేకంగా సాహిత్యం, కార్యాచరణతో ఉద్యమించిన కుసుమ ధర్మన్నను తొలి దళిత కవి అనీ లేదా దళిత ఉద్యమ నాయకుడు అని పరిమితం చేయవద్దని వెంకటేశ్వర విశ్వవిద్యాలయం విశ్రాంత ఉపకులపతి ఆచార్య కొలకలూరి ఇనాక్‌కోరారు. తెలుగు భాషా చైతన్య సమితి నిర్వహణలో శ్రీ త్యాగరాయ గాన సభలోని లలిత కళా వేదికపై కుసుమ ధర్మన్న కళాపీఠ ఆవిర్భావ సభ జరిగింది. ముఖ్య అతిథిగా ఆచార్య ఇనాక్ పాల్గొని కళాపీఠ్‌ను ఆరంభించి మాట్లాడారు. సమాజంలో సమాన హక్కుల కోసం కార్యకర్తగా, సాహితీవేత్తగా అణగారిన ప్రజల పక్షాన నిలిచిన ధర్మన్న తొలుత గాంధీజీని అనుసరించినా తదుపరి కాలంలో అసమ్మతి తెలిపారని వివరించారు. బలహీన వర్గాల కోసమే జయభేరి పత్రికను నడిపారని తెలిపారు. నైజాం నవాబ్ పిలుపుపై వచ్చిన ధర్మన్న ఇస్లామ్ మత స్వీకరణను నిరాకరించి స్వమతంలోనే ఉండి వివక్షతకు వ్యతిరేకంగా పోరాటం చేస్తానని తెలిపారని చెప్పారు ధర్మన్న ఆశయాలకు అనుగుణంగా సంస్థను నడపాలని సూచించారు. సాహితీవేత్త డాక్టర్ నారాయణస్వామి అధ్యక్షత వహించిన సభకు సంస్థ స్థాపకులు డాక్టర్ రాధ కుసుమ.. సంస్థ లక్ష్యాలు తెలిపారు. డాక్టర్ నలేశ్వరం శంకరం, సరోజిని దేవి,అంజని కుమారి, బడే సాబ్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. రామకృష్ణ, చంద్రమౌళి కవి సమ్మేళనం నిర్వహణ చేశారు.

ఇద్దరు... 'రహస్య' మిత్రులు

- ప్రజల సొమ్మును లూటీ చేస్తున్న తెలంగాణ సర్కార్
- పేదల పార్టీ అంటే కాంగ్రెస్సే
- ఎఐసిసి సెక్రెటరీ, కాంగ్రెస్ తెలంగాణ ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిజెపి, బిఆర్ఎస్ రహస్య మిత్రులని, రెండూ కలిసి ప్రజలను మోసం చేస్తున్నాయని ఎఐసిసి సెక్రెటరీ, కాంగ్రెస్ తెలంగాణ ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే ఆరోపించారు. ఆదివారం నల్లగొండ జిల్లా చందన పల్లి వద్ద సిఎల్‌పి నేత భట్టి విక్రమార్క పీపుల్స్ మార్చ్ పాదయాత్రకు హాజరై మద్దతు తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో సిబిఐ, ఇడి, ఐటిలాంటి పలు దర్యాప్తు సంస్థలు ఉన్నప్పటికీ బిఆర్ఎస్ ప్రభుత్వం, కెసిఆర్ అక్రమాలపై ఎందుకు విచారణ జరపడం లేదని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వంపై బీఆర్ఎస్ బహిరంగంగానే విమర్శలు చేస్తున్నప్పటికీ చర్యలు తీసుకోవడం లేదని, దానికి గల కారణం వారిద్దరి మధ్య ఉన్న స్నేహమేనని స్పష్టం చేశారు. కర్నాటక డిప్యూటీ సిఎం డికె శివకుమార్ తెలంగాణలో ఎన్నికల ప్రచారానికి వచ్చే విషయంలో ఏఐసీసీ పెద్దలదే తుదినిర్ణయమన్నారు. భట్టి విక్రమార్క పాదయాత్ర విజయవంతంగా కొనసాగుతుందన్నారు. దారి వెంట ప్రజలు తమ సమస్యలను, కష్టాలను, ఇబ్బందులను భట్టికి చెప్పుకోవడానికి ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల ముందు ఉంచడానికే భట్టి పాదయాత్ర చేస్తున్నారన్నారు. 2024లో 100 శాతం కాంగ్రెస్ తెలంగాణలో అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సిఎం కెసిఆర్ తెలంగాణ ప్రజల సంపద లూటీ చేసి ఇతర రాష్ట్రాల్లో బిఆర్ఎస్ కార్యాలయాలను ప్రారంభిస్తున్నారన్నారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ హయాంలో పేదలకు పంపిణీ చేసిన భూములను బలవంతంగా తిరిగి వెనక్కి గుంజుకుంటున్న బిఆర్ఎస్ ప్రభుత్వం వాటిని పెద్దలకు కట్టబెడుతున్నదన్నారు. ఒక్క సాగునీటి ప్రాజెక్టును పూర్తి చేయలేదని, తాగునీటి కోసం గ్రామాల్లో ప్రజలు తండ్లాడుతున్నారన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ కచ్చితంగా గెలుస్తుందన్న సంకేతాలు రావడంతో బీఆర్ఎస్, బీజేపీలో ఉన్న చాలామంది నాయకులు టిపిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి, సిఎల్‌పి నేత భట్టి విక్రమార్క, కాంగ్రెస్ సీనియర్ నేతలతో టచ్‌లో ఉన్నారని చెప్పారు. సరైన సమయంలో నిర్ణయం తీసుకొని వారిని పార్టీలోకి చేర్చుకుంటామన్నారు.

సిఎల్‌పి నేత భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. గమ్యం, గమనం లేని నేత పొద్దుతిరుగుడు పువ్వు గుత్తా సుఖేందర్‌రెడ్డి మాత్రమేనన్నారు. అధికారం ఎక్కడ ఉంటే అక్కడ అధికారం చుట్టూ తిరిగే వ్యక్తి అన్నారు. ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు పాదయాత్ర చేస్తున్న నాకు గమ్యం, గమనం ఉందని, భగ భగ మండుతున్న ఎండలు, గాలివానలతో టెంట్లు కూలిన, అకాల వర్షంలో తడుస్తూ నడిచానే తప్ప పాదయాత్ర ఎక్కడ ఆపలేదన్నారు. బిఆర్ఎస్ పాలనలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను మీడియా సాక్షిగా దేశానికి చూపించామన్నారు. రూ.42 వేల కోట్ల నిధులతో ఇంటింటికి నీరు అందించే మిషన్ భగీరథ నీళ్లు నేను పాదయాత్ర చేసిన గ్రామాల్లో 90 శాతం కనిపించలేదన్నారు. ఖాళీగా ఉన్న పైపులు, కట్టిన ట్యాంకులను ప్రజలు చూపించారన్నాని తెలిపారు. నీళ్ల పండుగ పేరుతో జలాల్లో పసుపు, కుంకుమ వదులుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, శాసనమండలి చైర్మెన్ల గుత్తా సుఖేందర్‌రెడ్డి ఎస్ఎల్‌బిసి టన్నెల్, నక్కలగండి పెండింగ్ ప్రాజెక్టులు ఎందుకు పూర్తి చేయలేదో ప్రజలకు స్పష్టత ఇవ్వాలన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను వదిలించుకోకుంటే నీళ్లు, నిధులు, నియామకాలు, ఆత్మగౌరవం లక్ష్యాలు నెరవేరకపోవడంతో పాటు తెలంగాణలో బతికే స్వేచ్ఛ లేకుండా పోతుందన్నారు. కార్యక్రమంలో ఎఐసిసి కార్యదర్శి రోహిత్ చౌదరి, ఎమ్మెల్యే పోడెం వీరయ్య, డిసిసి అధ్యక్షులు శంకర్‌నాయక్, టిపిసిసి ప్రధాన కార్యదర్శిలు కొండేటి మల్లయ్య, చల్లమల్ల కృష్ణారెడ్డి, నల్లగొండ జెడ్‌పిటిసి వంగూరు లక్ష్మయ్య, నల్లగొండ పట్టణ అధ్యక్షులు గుమ్ముల మోహన్ రెడ్డి, వైస్ఎంపీపీ జిల్లపల్లి పరమేష్, తదితరులు పాల్గొన్నారు.

మాకూ భూములివ్వండి

కెసిఆర్‌కు కాసాని లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లోని కోకాపేటలో మానవ వనరుల అభివృద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు బిఆర్ఎస్‌కు 11 ఎకరాల భూమి కేటాయించిన విధంగా టిడిపికి ఇవ్వాలని ఆ పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ కోరారు. ఈ మేరకు ఆదివారం సిఎం కెసిఆర్‌కు లేఖ రాశారు. గజం రూ.7,500 ధరకు కేటాయిస్తూ 18 మే 2023న జరిగిన క్యాబినెట్ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నదని గుర్తు చేశారు. ఈ నెల మొదటి వారంలో భారత్‌భవన్ నిర్మాణానికి మీరు శంకుస్థాపన చేస్తూ దేశ విదేశాల్లో రాజకీయ సామాజిక, ఆర్థిక రంగాల్లో అనుభవజ్ఞులైన గొప్ప మేధావులను, నోబెల్ విజేతలనూ పిలిచి రేపటి పౌరులకు ఇక్కడ నిర్మించే భవనంలో నాయకత్వ శిక్షణ ఇప్పిస్తామన్నారు. తద్వారా భారత ప్రజాస్వామిక సౌధాన్ని మరింత పటిష్టం చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఇక్కడ నిర్మించే 15 అంతస్తుల భవనంలో మిని హాళ్లు, విశాలమైన సమావేశ మందిరాలు, అత్యాధునిక డిజిటల్ లైబ్రరీలు, వసతి కోసం లగ్జరీ గదులను ఏర్పాటు చేస్తామన్నారని వివరించారు. బిఆర్ఎస్‌కి ఇచ్చిన విధంగానే టిడిపికి సైతం మానవ వనరుల అభివృద్ధి కేంద్ర భవన నిర్మాణానికి కోకాపేటలో గజం రూ. 7,500 లకు 11 ఎకరాల భూమిని కేటాయించవలసిందిగా కోరుతున్నామని అన్నారు. టిడిపితో పాటు రాష్ట్రంలో గుర్తింపు పొందిన పార్టీలన్నింటికీ భూములు కేటాయించాల్సిందిగా కోరుతున్నామని తెలిపారు. టిడిపి హైదరాబాద్ జిల్లా ఆఫీసు కోసం బంజారాహిల్స్‌లో ఎకరం భూమిని గజం రూ.వంద చొప్పున కేటాయించాల్సిందిగా కోరుతున్నామని వివరించారు.

మా కాలేజీ మా ఇష్టం...

- దోస్త్‌లోలేని ప్రయివేటు డిగ్రీ కళాశాలల ఇష్టారాజ్యం
- అడ్డగోలుగా ఫీజు దోపిడీ
- రిజర్వేషన్లు పాటించని వైనం
- పేద విద్యార్థులకు తీరని అన్యాయం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) పరిధిలో లేని ప్రయివేటు కాలేజీల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. విశ్వవిద్యాలయం నిర్ణయించినవి కాకుండా సొంతంగా అడ్డగోలుగా ఫీజును ఖరారు చేసి వసూలు చేస్తున్నాయి. విద్యార్థులను దోపిడీ చేస్తున్నాయి. ఇంకోవైపు విశ్వవిద్యాలయం అనుబంధ గుర్తింపును మాత్రం పొందుతున్నాయి. కానీ నిబంధనలకు మాత్రం యథేచ్ఛగా తూట్లు పొడుస్తున్నాయి. విశ్వవిద్యాలయం నిర్ణయించిన ఫీజులను వసూలు చేయకపోవడమే ఇందుకు నిదర్శనం. రాష్ట్రంలో బీకాం కంప్యూటర్స్ కోర్సుకు భారీగా డిమాండ్ ఉన్నది. ఒయు పరిధిలో రూ.10,950 వసూలు చేయాలి. దానికి అదనంగా రూ.పది వేలు విద్యార్థుల నుంచి వసూలు చేసుకునేందుకు ఉన్నత విద్యామండలి అవకాశం కల్పించింది. కానీ దోస్త్ పరిధిలో లేని కాలేజీలు ఎంత ఫీజు వసూలు చేస్తాయన్న దానికి ప్రాతిపదిక లేదు. హైదరాబాద్‌లో ఓ ప్రముఖ ప్రయివేటు డిగ్రీ కాలేజీ బీకాం కంప్యూటర్స్ కోర్సుకు రూ.1.10 లక్షలు వసూలు చేస్తున్నట్టు తెలిపింది. ఇంకోవైపు డిగ్రీ ప్రవేశాల ప్రక్రియను దోస్త్ ద్వారా ఓ షెడ్యూల్ ప్రకారం చేపడతారు. కానీ దోస్త్ పరిధిలో లేని ప్రయివేటు డిగ్రీ కాలేజీలు ఆ షెడ్యూల్‌ను పాటించకుండా కాలపరిమితి లేకుండా అడ్మిషన్లు చేపడుతున్నాయి. దీంతో విద్యాసంవత్సరం సజావుగా నడవడంలేదన్న అభిప్రాయం విద్యాశాఖ, ఉన్నత విద్యామండలి అధికారుల నుంచి వ్యక్తమవుతోంది. 'మా కాలేజీ మా ఇష్టం' అన్నట్టుగా ఆ కాలేజీలు వ్యవహరిస్తున్నాయి. 2016-17 విద్యాసంవత్సరంలో దోస్త్‌ను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. అప్పటి నుంచి రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రయివేటు డిగ్రీ కాలేజీల్లో దోస్త్ ద్వారానే ప్రవేశాలు జరుగుతున్నాయి. అయితే మైనార్టీ, గురుకుల డిగ్రీ కాలేజీలకు దోస్త్ నుంచి మినహాయింపు ఉంది. కానీ కొన్ని ప్రయివేటు డిగ్రీ కాలేజీ యాజమాన్యాలు హైకోర్టు అనుమతితో దోస్త్ పరిధిలో చేరకుండానే సొంతంగా ప్రవేశాలు చేపడుతున్నాయి.

దోస్త్ ద్వారా చేరితేనే ఫీజు రీయింబర్స్‌మెంట్

దోస్త్ ద్వారా చేరిన విద్యార్థులకే ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం వర్తిస్తుంది. వారికే కాలేజీ ఫీజుతోపాటు స్కాలర్‌షిప్ వస్తుంది. దోస్త్ పరిధిలో లేకుండా సొంతంగా ప్రవేశాలు చేపట్టే ప్రయివేటు డిగ్రీ కాలేజీలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం వర్తించదు. అంటే ఆ కాలేజీల్లో చదివే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ రాదు. అయితే మైనార్టీ, సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలు, గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలు, బిసి సంక్షేమ గురుకుల డిగ్రీ కాలేజీలకు దోస్త్ నుంచి ప్రభుత్వమే మినహాయింపు కల్పించింది.

అందుకే వాటిలో చేరిన విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం వర్తిస్తుంది. 2022-23 విద్యాసంవత్సరంలో దోస్త్ పరిధిలో లేకుండా మైనార్టీ, ప్రయివేటు డిగ్రీ కాలేజీలు కలిపి 63 ఉన్నాయి. వాటిలో 36,817 సీట్లుంటే, 18,421 మంది చేరారు. 64 గురుకుల డిగ్రీ కాలేజీల్లో 15,774 సీట్లకుగాను 8,509 మంది ప్రవేశం పొందారు. ఇంకోవైపు దోస్త్ పరిధిలో లేని ప్రయివేటు డిగ్రీ కాలేజీల్లో ఫీజులూ భారీగా ఉంటాయి. ఆ ఫీజుల మొత్తాన్ని విద్యార్థులే భరించాలి. అంటే డబ్బున్నోళ్లకే ఆ కాలేజీల్లో సీట్లు దొరుకుతాయి. ఆ కాలేజీల్లో చదవాలన్న ఆశ ఉన్నా ఫీజు రీయింబర్స్‌మెంట్ సౌకర్యం లేని కారణంగా పేద విద్యార్థులు తీవ్రంగా అన్యాయానికి గురవుతున్నారు. ఇంకోవైపు ఆ కాలేజీల్లో రిజర్వేషన్లు పాటించడం లేదు. మెరిట్ లేకుండానే అడ్మిషన్లు కల్పిస్తున్నారు. కేవలం డబ్బు చెల్లించిన వారికే ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇలా అన్ని విషయాల్లోనూ ఆ కాలేజీలు నిబంధనలకు తిలోదకాలిస్తున్నాయి. అయితే దోస్త్ పరిధిలో లేని ప్రయివేటు డిగ్రీ కాలేజీలను కట్టడి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. అందులో భాగంగానే కొత్త కోర్సులను మంజూరు చేయడం, సీట్లు పెంచడం వంటి అవకాశాలను కల్పించకూడదని నిర్ణయం తీసుకుంది.

దోస్త్ పరిధిలోకి రావాలి : ఆర్ లింబాద్రి, ఉన్నత విద్యామండలి చైర్మెన్

రాష్ట్రంలోని డిగ్రీ కాలేజీలన్నీ దోస్త్ ద్వారానే ప్రవేశాలు చేపట్టాలి. కోర్టు ద్వారా అనుమతి పొందిన కాలేజీల్లోనూ దోస్త్ పరిధిలోకి రావాలి. ఇటీవల ఆ కాలేజీ యాజమాన్యాలతో సమావేశాన్ని నిర్వహించాం. విశ్వవిద్యాలయం నిర్ణయించిన ఫీజు తక్కువగా ఉన్నందునే దోస్త్ పరిధిలో రావడం లేదంటూ మా దృష్టికి తెచ్చాయి. దోస్త్ పరిధిలోకి వస్తే ప్రత్యామ్నాయాలను ఆలోచిస్తాం. ఇప్పటికే ఒయు పరిధిలో రూ.పది వేలు విద్యార్థుల నుంచి వసూలు చేసుకునేందుకు అవకాశమిచ్చాం. అవసరమైతే యాజమాన్య కోటా అమలుకు చర్యలు తీసుకుంటాం. రాష్ట్రంలోని విద్యార్థులందరూ అన్ని కాలేజీల్లో సీట్లు పొందే అవకాశముండాలి. దీన్ని ఆ కాలేజీలు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి.